Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 163 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 4 - 1 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్.. 12 మంది నక్సల్స్ మృతి




**ఇంటర్నెట్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సల్స్ మృతి చెందినట్టు తెలుస్తోంది. సుక్మా జిల్లాలో తెల్లవారుజామున ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో కుంటా ఏరియా కమిటీకి చెందిన సచిన్ మంగ్డు మరణించినట్టు సమాచారం. ఆ ప్రాంతంలో భద్రతా దళాలు భారీ స్థాయిలో ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నాయి. నక్సలైట్ల సంచారం ఉన్నట్టు సమాచారం అందడటంతో జిల్లాకు చెందిన రిజర్వ్ గార్డ్ పోలీసుల బృందం ఈ తెల్లవారుజామున రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే నక్సల్స్, పోలీసుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో గతేడాది వివిధ ఎన్‌కౌంటర్‌లలో 285 మంది నక్సల్స్ మృతి చెందారు. బస్తర్ డివిజన్ (ఏడు జిల్లాలు) 257 మంది మృతి చెందగా మిగతా 27 మంది రాయ్‌పూర్ డివిజన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లల్లో మరణించారు. ఇక తాజా ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## శ్రీనివాస కల్యాణంతో మహాసభలకు శ్రీకారం



**గుంటూరు, (రాజధాని వార్తలు):** మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు అంకురార్పణ జరిగింది. శనివారం ఉదయం శ్రీనివాస కల్యాణ కార్యక్రమంతో తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఇక నేటి నుంచి ఈనెల 5 వరకు మూడో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా పలువురికి పురస్కారాలను అందజేయనున్నారు. ఐదు సువిశాల వేదికల్లో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరుగనున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభలకు ఈరోజు ఒడిశా గవర్నర్ కంభంపాటి హాజరు కానున్నారు. రేపు (ఆదివారం) ప్రపంచ తెలుగు మహాసభల్లో మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ పాల్గొననున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు ఒక దేశాధ్యక్షుడు రావడం ఇదే ప్రథమం. ఇక సోమవారం నాడు జరిగే మహాసభల్లో సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొననున్నారు. ప్రముఖుల హాజరుతో ప్రపంచ తెలుగు మహాసభలు మరింత వైభవంగా సాగనున్నాయి.

## న్యూఇయర్ వేడుకల పేరుతో హంగామా.. శ్రీశైలం సిబ్బంది వీడియో వైరల్

**నంద్యాల, (రాజధాని వార్తలు):** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో సిబ్బంది వికృత చేష్టలు కలకలం రేపుతున్నాయి. డిసెంబర్ 31 అర్ధరాత్రి న్యూ ఇయర్ వేడుకల్లో శ్రీశైలంలోని ప్రైవేటు అన్నదాన సత్రం సిబ్బంది హంగామా వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పేరుతో సినిమా ఐటమ్ సాంగ్స్‌పై సత్రం సిబ్బంది డ్యాన్స్‌లు చేయడం వివాదానికి దారి తీసింది. దేవాదాయ శాఖ నిబంధనలు ఉల్లంఘించి మరీ సినిమా ఐటమ్ సాంగ్‌లతో సత్రం సిబ్బంది న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. వీరి డ్యాన్స్‌లకు సంబంధించిన వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సత్రం సిబ్బంది వీడియో సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ వీడియోపై నెటిజన్లు, మల్లన్న భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల శ్రీశైలం సమీపంలో ఓ యువతి రీల్స్ చేయడం ఎంతటి దుమారాన్ని రేపిందో అందరికీ తెలిసిందే. భక్తుల మనోభావాలకు భంగం కలిగించేలా రీల్స్ చేసిన యువతిపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో స్పందించిన యువతి..



తాను దేవాలయంలో డ్యాన్స్ చేయలేదని స్పష్టం చేసింది. సాంగ్‌లో శారీ కట్టుకుని సాంప్రదాయంగానే డ్యాన్స్ చేసినట్లు చెప్పుకొచ్చింది. తప్పు ఉంటే క్షమించాలని కోరుతూ యువతి సెల్ఫీ వీడియోలో తెలిపింది. మరోవైపు ఈ ఘటనను శ్రీశైలం దేవస్థానం అధికారులు కూడా సీరియస్‌గా తీసుకున్నారు. దేవస్థానం అనుమతి లేకుండా క్షేత్ర పరిధిలో శ్రీశైలంలో ఎక్కడైనా వీడియోలు, ఫోటోలు తీస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని శ్రీశైలం దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో డిసెంబర్ 31న శ్రీశైలంలో ప్రైవేటు అన్నదాన సత్రం సిబ్బంది వ్యవహారంపై దేవస్థానం అధికారులు స్పందన ఎలా ఉంటుందో చూడాలి మరి.

## బీజేపీని చూసి ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోలేరు : మోహన్ భగవత్

**భోపాల్:** యూనిఫాం, శారీరక వ్యాయామాలు ఉన్నప్పటికీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పారామిలటరీ సంస్థ కాదని, బీజేపీని చూసి ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోవాలనుకుంటే అది పెద్ద పొరపాటని ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. సమాజాన్ని ఏకం చేయడం, భారతదేశం మరోసారి విదేశీ శక్తుల గుప్పిట్లోకి వెళ్లకుండా అవసరమైన లక్షణాలు, సద్గుణాలను నింపడానికి ఆర్ఎస్ఎస్ పని చేస్తుందని భోపాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తెలిపారు. 'మేము యూనిఫాం ధరిస్తాం. కవాతులు, కర్రలతో ఎక్సర్‌సైజ్‌లు చేస్తాం. ఇది చూసి మమ్మల్ని ఎవరైనా పారామిలటరీ సంస్థ అనుకుంటే పొరపడినట్టే. సంఘ్ ఒక విలక్షణ సంస్థ. సంఘ్‌ను అర్థం చేసుకోవడం కష్టం' అని భగవత్ అన్నారు. జన్‌సంఘ్, దానినుంచి వచ్చిన బీజేపీకి ఆర్ఎస్ఎస్ మాతృసంస్థనే విస్తృతాభిప్రాయం ఉందని, అయితే అవి సంఘ్‌కు వ్యతిరేకంగా అల్లుకున్న కథనాలేనని అన్నారు. ఇవాళ ప్రజలు సరైన సమాచారం కోసం లోతుగా వెళ్లడం లేదని, మూలాలకు వెళ్లరని, వికీపీడియాకు వెళ్తుంటారని, అయితే అక్కడి సమచారం అంతా నిజం కాదని పేర్కొన్నారు. ఎవరైతే సంఘ్ గురించి విశ్వసనీయ వనరుల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తారో వారికే సంఘ్ గురించి తెలుస్తుందని అన్నారు. ఇలాంటి అపోహలరీత్యా ఆర్ఎస్ఎస్ పాత్ర, మిషన్ గురించి వివరించాల్సిన అవసరం ఏర్పడిందని సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న భగవత్ తెలిపారు. స్వయం సేవకులకు సంఘ్ తీర్దిదిద్దుతుందని, భారతదేశ పరమ వైభవం కోసం పనిచేసేందుకు విలువలు, ఆలోచన, లక్ష్యాలను పెంపొంది స్తుందని, రిమోట్ ద్వారా నియంత్రించదని భగవత్ వివరించారు. దేశభక్తి వాతావరణాన్ని నిర్మించే కార్మికులను సృష్టించడానికి సంఘ్ తన శాఖల ద్వారా పనిచేస్తుందన్నారు. సంఘ్ అనేది ఒక ప్రతిచర్యగా పుట్టిందనే సాధారణ భావన ఉందని, అయితే అది నిజం కాదని చెప్పారు. సంఘ్ దేనికీ ప్రతిచర్య, వ్యతిరేకం కాదని, సంఘ్ ఎవరి తోనూ పోటీ పడటం లేదని అన్నారు. దేశంపై మొదటగా దండెత్తిన వాళ్లు బ్రిటిషర్లు




కాదని, భారతీయుల కంటే తక్కువ స్థాయిలో ఉన్న కొందరు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మనలను ఓడిం చారని చెప్పారు. ఇది ఏడుసార్లు జరిగిందని, ఎనిమిదవ ఆక్రమణ దారులు ఆంగ్లేయులని వివరించారు. అలాంటప్పుడు స్వాతంత్ర్యానికి హామీ ఏమిటి? ఇది పదే పదే ఎందుకు జరుగుతోందో మనం ఆలోచించాలని భగవత్ సూచించారు. మనను మనం అర్థం చేసు కుని స్వార్థానికి అతీతంగా ఎదగాలని, సద్గుణాలతో సమాజం ఏకతాటిపై నిలిస్తే దేశానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాజకీయ బానిసత్వానికి తెరపడినా, మానసిక బానిసత్వం కొంతవరకూ కొనసాగుతోందన్నారు. దానికి చరమగీతం పాడాలన్నారు. స్వదేశీ అంటే ప్రపంచంతో వాణిజ్యాన్ని తగ్గించుకోవడం కాదని, భారతదేశంలో తయారుకాని మందులు వంటి ముఖ్యమైన వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకోవాలని అన్నారు. వాణిజ్యం అనేది ఒత్తిడి, సుంకాల భయంతో జరక్కూడదని, సొంత నిబంధనల ప్రకారమే జరగాలని సూచించారు. సంఘ్ ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని, సంఘ్ ఎప్పుడూ బయట నుంచి వచ్చే నిధులు, విరాళాలపై ఆధార పడదని భగవత్ చెప్పారు. సంఘ్‌ను బాగా అర్థం చేసుకోవాలనుకుంటే సంఘ్ శాఖలకు రావాలని కోరారు. చక్కెర రుచి గురించి తాను రెండు గంటల పాటు వివరించినా ఒక టీ స్పూన్ చక్కర తాగితేనే అర్థమవుతుందని, అదేవిధంగా శాఖలకు వస్తేనే సంఘ్ గురించి అర్థమవుతుందని చెప్పారు.

## అరకు లోయలో దారుణం.. ఆస్పత్రి బాత్రూమ్‌లో మృత శిశువు కలకలం




**విశాఖపట్నం జిల్లా, (రాజధాని వార్తలు):** అరకులోయ ఏరియా ఆసుపత్రిలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ప్రభుత్వాసుపత్రిలోని లేడీస్ బాత్‌రూమ్‌లో ఒక నవ జాతి శిశువు మృతదేహం తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని మహిళ మృత శిశువుకు జన్మనిచ్చిందా లేదా ప్రసవం తర్వాత చనిపోయిందా అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. బాత్‌రూమ్ క్లీన్ చేయడానికి వెళ్లిన కార్మికురాలు శిశువును చూసి కేకలు వేయడంతో విషయం బయటకు వచ్చింది. వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆసుపత్రి ఎంట్రెన్స్, చుట్టుపక్కల ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలు పరిశీస్తున్నారు పోలీసులు. శనివారం ఉదయం ఆసుపత్రికి వచ్చిన గర్భిణి ఎవరు? ఓపీ రిజిస్ట్రార్‌లో ఎవరు నమోదు చేసుకు న్నారు అనే కోణంలో రికార్డులను తనిఖీ చేస్తున్నారు. సదరు గర్భిణి బాత్ రూమ్‌కి వెళ్లి అక్కడే ప్రసవించినట్లు సమాచారం. శిశువు మరణించడంతో ఆందోళనకు గురై వదిలేసి పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అదనంగా ప్రోత్సహకాలు ఇవ్వాలి : మాధవ్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రకృతి వ్యవసాయం చేసే వారికి అదనంగా రూ. 4 వేలు ప్రోత్సాహకాలు ఇవ్వాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. విజయవాడలో శనివారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై సహజ రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ విధానంతో మంచి దిగుబడి సాధించిన అన్నదాతలను మాధవ్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు మాధవ్. ప్రకృతి వ్యవసాయం చేసే వారి ఇబ్బందులు, కొత్త పద్ధతులు, ఆదర్శవంతమైన సాగుచేసే వారితో నేడు ఈ సదస్సు ఏర్పాటు చేశామని వెల్లడించారు పీవీఎన్ మాధవ్. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా విజయవంతమైన రైతన్నల అభిప్రాయాలు, అనుభవాలు వివరించారని అన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్దంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. జాతీయ, ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంపై అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఫసల్ భీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సీడీ ఇచ్చేలా భరోసా ఇచ్చారని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం చేసే వారిని అన్నివిధాలా ప్రోత్సహించాలని సూచించారు. దేశంలో ముప్పై శాతం మంది ప్రకృతి వ్యవసాయం రావాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని అన్నారు. ఆర్థిక స్వావలంబన కావాలంటే ప్రకృతి వ్యవసాయ విధానమే మార్గమని చెప్పుకొచ్చారు పీవీఎన్ మాధవ్. ఇతర దేశాలపై ఆధారపడి యూరియా, పురుగు మందులు కొనే విధానం ఆగిపోవాలని సూచించారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. రైతు బజార్లలో కొన్ని స్టాల్స్‌ను పెడుతున్నారని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన ఉత్పత్తులతో ప్రత్యేకంగా సంతలు, రైతు బజార్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. కేంద్రం అమలు చేసే పథకాల గురించి అందరూ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరూ ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లేలా ప్రోత్సహించాలని కోరారు. ఈరోజు సదస్సులో చేసిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరిస్తామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.



## అంతర్వేది రథ శకలాల నిమజ్జన కార్యక్రమం వాయిదా


**అమరావతి, (రాజధాని వార్తలు):** బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి రథ శకలాల నిమజ్జన కార్యక్రమం వాయిదా పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి రథం దహనమైన సంగతి తెలిసిందే. ఆ రథం స్థానంలో కొత్త రథాన్ని అంతర్వేది దేవస్థానం ఏర్పాటు చేసింది. పాత రథాన్ని ఆగమశాస్త్ర విధానాలు, నిబంధనలకు లోబడి నిమజ్జనం చేసే కార్యక్రమంపై ఇటీవలే దేవాదాయ శాఖ కార్యాచరణ ప్రకటించింది. ఈ ప్రకారం రేపు(ఆదివారం) మధ్యాహ్నం 3 గంటలకు రథ శకలాల నిమజ్జనం చేయాల్సి ఉంది. అయితే ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు దేవాదాయ శాఖ ప్రకటించింది. ఆగమశాస్త్ర నిబంధనలు, మూహూర్తాలపై చర్చించిన అనంతరం దేవాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. మరింత విస్తృత చర్చల అనంతరం... పూర్తిస్థాయి ఆగమశాస్త్ర



నిబంధనల ప్రకారం అభిప్రాయాలు సేకరించి రథ శకలాలను నిమజ్జనం చేయాలని నిర్ణయించింది. భక్తుల మనోభావాల నేపథ్యంలో నిమజ్జన ప్రక్రియను మరో ముహూర్తంలో అత్యంత శాస్త్రబద్ధంగా నిర్వహించాలని దేవస్థానం, దేవాదాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.

# ప్రజా సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుంది

**- నూతన సంవత్సరాన్ని సేవా కార్యక్రమంతో ప్రారంభించడం ఆనందంగా ఉంది - టిపి గూడూరు మండలం ముంగలదొరువు గ్రామంలో విపిఆర్ అమృత ధార ప్లాంట్ ను ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి - విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1050 మందికి ట్రై సైకిల్స్ అందజేత - సర్వేపల్లిలో కూడా విపిఆర్ నేత్ర సేవలు ప్రారంభిస్తాం - కష్టపడి పని చేసే నాయకుల్ని ప్రోత్సహించాలి - కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలతో రైతన్నలకు భరోసా - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో నెల్లూరులోకి కలువాయి, సైదాపురం, రాపూరు, గూడూరులోని 3 మండలాలు**










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం తనకు సంతృప్తిని ఇస్తుందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సర్వేపల్లి నియోజకవర్గం టిపి గూడూరు మండలం ముంగలదొరువు గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రాజముద్రతో నూతనంగా తీసుకు వచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను ఆయా రైతులకు అందజేశారు. తొలుత గ్రామానికి వచ్చిన నేతలకు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 2026 నూతన సంవత్సరాన్ని సేవా కార్యక్రమాలతో మొదలు పెడుతుండటం మరింత ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. ఈ వారంలో 19 వాటర్ ప్లాంట్స్ ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రారంభోత్సవాలు విపిఆర్ ఫౌండేషన్ సమర్థతకు, సేవా రూపానికి నిదర్శనమని చెప్పారు. ప్రజలకు ఇలా సేవ చేసే అదృష్టం ఇచ్చిన ఆ భగవంతుడికి, ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సర్వేపల్లిలో ఇప్పటి వరకు 8 ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో సర్పంచి కవిత ఎమోషనల్ అవడం పై ఎంపీ స్పందించారు. గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఇలాంటి వారు మళ్లీ ఎన్నిక కావాలని ఆయన ఆకాంక్షించారు. కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను, గూడూరు నియోజకవర్గం లోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాలో కొనసాగించడంపై సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ సందర్భంగా ఆయన స్పందించి వీటిని కొనసాగించేలా చేశారన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 1050 మంది దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిల్స్ అందజేశామన్నారు. ఇప్పుడు విపి ఆర్ నేత్ర కార్యక్రమం ద్వారా గ్రామీణలకు కంటి పరీక్షలు చేయిస్తున్నామని ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో దాదాపు పదివేల మంది పరీక్షలు చేయగా 6000 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశామన్నారు. సర్వేపల్లిలో కూడా సేవలందిస్తామన్నారు. తాను గతంలో వైసీపీలో ఉండి తప్పు చేశానని, ఈరోజు ఆ దేవుడి దయవల్ల టిడిపిలోకి చేరనన్నారు. మంచి మనస్తత్వం ఉన్న నాయకుల ఆధ్వర్యంలో పనిచేయడం ఆనందంగా ఉందని చెప్పారు. నెల్లూరు జిల్లా అధ్యక్షులుగా అనుభవం ఉన్న బీద రవిచంద్ర అందరిని కలుపుకొని వెళుతున్నారనీ, ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వంటి అనుభవం ఉన్న ఎమ్మెల్యే ఉండడం ప్రజల అదృష్టమని, అన్ని విధాల అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. వంశీధర్ రెడ్డి బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడుగా మంచి ప్రతిభ చూపుతున్నారని ప్రశంసించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పనిచేస్తుండడం తమకు గర్వకారణమని వెల్లడించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమృత ధార వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడమే కాకుండా నిర్వహణ చేపట్టడం గొప్ప విషయమన్నారు. విపిఆర్ నేత్ర ద్వారా కంటి అద్దాలు అందజేస్తున్నారని స్పష్టం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలాంటి వ్యక్తిగా అరుదుగా ఉంటారని చెప్పారు. విపిఆర్ సహాయ సహకారాలతో సైదాపురం, రాపూరు, కలువాయి, గూడూరులోని మూడు మండలాలు నెల్లూరులో కొనసాగుతునాయని అన్నారు. నెల్లూరు జిల్లాలో గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తమ ఆధ్వర్యంలో 3,000 మంది గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించామని, గిరిజనుల అభివృద్ధికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ఫోటోతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చిందని, రైతుల భూమిని తన భూములుగా ఫోటో వేయించుకోవడం దారుణం అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను సీఎం చంద్రబాబు సరి చేస్తూ కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్నారని స్పష్టం చేశారు. రైతుల నోర్లు కొడతామంటే కుదరదని చెప్పారు. ఎమ్మెల్సీ, టీడీపీ పార్టీ



జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర మాట్లాడుతూ.. విద్య, వైద్యం, వాటర్ ప్లాంట్, ట్రై సైకిల్స్ ఏర్పాటుతో పేదల అభ్యున్నతికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం ఉదయగిరిలో నిర్వహిస్తున్న విపిఆర్ నేత్ర సేవలను ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు విపిఆర్ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మంచి పాలనందుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, నెల్లూరు రీజియన్ ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, ఏపీ ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్. శివప్రసాద్ జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సురేష్, సర్పంచ్ కవిత, టిడిపి నాయకులు కేతన్ రెడ్డి వినోద్ రెడ్డి, జనసేన నాయకులు గుడి హరిరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# “పోలీసు దౌర్జన్యాలను సహించం” : కాకాణి










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వెంకటాచలం మండలం, ఇడిమేపల్లి గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బెల్లంకొండ గురువయ్యను వెంకటాచలం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి, వెంకటాచలం సర్కిల్ ఇన్స్ పెక్టర్ బూతులు తిట్టడం, కొట్టడంతో పాటు, చిత్రహింసలకు గురిచేయడంతో, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి, పెన్నా హాస్పిటల్‌లో ప్రాణాపాయస్థితిలో ఉన్న గురువయ్యను పరామర్శించి, మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. కూటమి పాలనలో పోలీసులు బరితెగించి, అధికార పార్టీ నాయకులకు సలాం కొడుతూ, వాళ్ల దగ్గర గులాంగిరి చేస్తూ, ప్రతిపక్షానికి చెందిన వ్యక్తులను హింసించడం క్షమించరాని నేరం. వెంకటాచలం సీఐ సుబ్బారావు అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తూ, అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతూ, తాను అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడు. బెల్లంకొండ గురవయ్య ఆత్మహత్యకు పాల్పడి, ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడడాన్ని చూస్తుంటే, సంబంధిత పోలీసులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, చర్యలు చేపట్టవలసిందిగా జిల్లా ఎస్పీని కోరుతున్నాం. బెల్లంకొండ గురువయ్యను వెంకటాచలం సీఐ సుబ్బారావు కొట్టడంతో పాటు, తీవ్ర పదజాలంతో బూతులు తిట్టడంతో సహించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బెల్లంకొండ గురువయ్య ఆత్మహత్యయత్నంతో తల్లడిల్లిపోతూ, ఆవేదన చెందుతున్న కుటుంబసభ్యులను చూస్తుంటే మనసు చలించిపోతుంది. పోలీసులు అధికార పార్టీ నాయకులను సంతృప్తి పరిచేందుకు ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యక్తులపై దాడులు చేయడం, అవమానపరచడం ఆనవాయితీగా మారిపోయింది. మీడియా ముందు మాట్లాడినా, ప్రభుత్వాన్ని, అధికార పార్టీని ప్రశ్నించినా వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి, దారుణంగా హింసించడం దుర్మార్గం. ఇప్పటికే వెంకటాచలం సీఐ సుబ్బారావు అవినీతి అక్రమాలపై కృష్ణ కాంత్ ఎస్పీగా ఉన్నప్పుడు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా, అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరించిన కృష్ణ కాంత్ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వెంకటాచలం సీఐ సుబ్బారావు పై ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఎస్పీ విచారణ చేపట్టి తక్షణమే సస్పెండ్ చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాం. జిల్లాలో పోలీసులు శాంతి భద్రతలను కాపాడడంలో, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో శాంతి భద్రతలు అదుపు తప్పాయి. పోలీసు యంత్రాంగం శాంతిభద్రతలపై దృష్టి పెట్టకుండా, ప్రతిపక్షాల వారి ఫ్లెక్సీలు తొలగించడం, అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు కట్టడమే తమకు ముఖ్యం అన్నట్లుగా విధులు నిర్వహిస్తున్నారు. బెల్లంకొండ గురువయ్య కుటుంబానికి అండగా నిలవడంతో పాటు, వేధించిన సీఐ సుబ్బారావు, తదితరులపై విచారణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోని నేపథ్యంలో, న్యాయస్థానాన్ని ఆశ్రయించైనా నిందితులైన పోలీసు అధికారులను గుర్తించి తగు చర్యలు తీసుకునే విధంగా న్యాయపోరాటం చేస్తాం. పోలీసులు ఇదే పంథాను కొనసాగిస్తే, ప్రజలందరూ ఏకమై, పోలీస్ స్టేషన్లను ముట్టడించే పరిస్థితి ఏర్పడితే, జరగబోవు సంఘటనలకు పోలీస్ శాఖ బాధ్యత వహించాల్సిందే! జిల్లా ఎస్పీ చొరవ తీసుకొని అడ్డగోలుగా వ్యవహరిస్తూ, విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న సర్కిల్ ఇన్స్ పెక్టర్ సుబ్బారావు లాంటి మీద విచారణ జరిపించి, చర్యలు చేపట్టకపోతే ప్రజల్లో పోలీస్ శాఖ పట్ల ఉన్న నమ్మకం మసకబారుతుంది. జిల్లాలో ఎక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అన్యాయం జరిగినా, అండగా నిలిచి, అన్ని విధాలా ఆదుకోవడంతో పాటు, ఏ స్థాయి అధికారి అయినా నిలదీస్తాం, ప్రజల ముందు దోషులుగా నిలబెట్టుతాం తప్ప, ఉపేక్షించే పరిస్థితి లేదు. కృష్ణకాంత్ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వెంకటాచలం సీఐ సుబ్బారావుపై ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఎస్పీ విచారణ చేపట్టి తక్షణమే సస్పెండ్ చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాం. జిల్లాలో

పోలీసులు శాంతి భద్రతలను కాపాడడంలో, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో శాంతి భద్రతలు అదుపు తప్పాయి. పోలీసు యంత్రాంగం శాంతి భద్రతలపై దృష్టి పెట్టకుండా, ప్రతిపక్షాల వారి ఫ్లెక్సీలు తొలగించడం, అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు కట్టడమే తమకు ముఖ్యం అన్నట్లుగా విధులు నిర్వహిస్తున్నారు. బెల్లంకొండ గురువయ్య కుటుంబానికి అండగా నిలవడంతో పాటు, వేధించిన సీఐ సుబ్బారావు, తదితరులపై విచారణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోని నేపథ్యంలో, న్యాయస్థానాన్ని ఆశ్రయించైనా నిందితులైన పోలీసు అధికారులను గుర్తించి తగు చర్యలు తీసుకునే విధంగా న్యాయపోరాటం చేస్తాం. పోలీసులు ఇదే పంథాను కొనసాగిస్తే, ప్రజలందరూ ఏకమై, పోలీస్ స్టేషన్లను ముట్టడించే పరిస్థితి ఏర్పడితే, జరగబోవు సంఘటనలకు పోలీస్ శాఖ బాధ్యత వహించాల్సిందే! జిల్లా ఎస్పీ చొరవ తీసుకొని అడ్డగోలుగా వ్యవహరిస్తూ, విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న సర్కిల్ ఇన్స్ పెక్టర్ సుబ్బారావు లాంటి వారి మీద విచారణ జరిపించి, చర్యలు చేపట్టకపోతే ప్రజల్లో పోలీస్ శాఖ పట్ల ఉన్న నమ్మకం మసకబారుతుంది. జిల్లాలో ఎక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అన్యాయం జరిగినా, అండగా నిలిచి, అన్ని విధాలా ఆదుకోవడంతో పాటు, ఏ స్థాయి అధికారి అయినా నిలదీస్తాం, ప్రజల ముందు దోషులుగా నిలబెట్టుతాం తప్ప, ఉపేక్షించే పరిస్థితి లేదు.

# చాగంటి కోటేశ్వరరావుకి ఘన స్వాగతం



**అన్నవరం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు వారి సతీమణితో ఆలయానికి విచ్చేసారు. వారికి దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు, ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్ ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆలయం అర్చకులు చాగంటి కోటేశ్వరరావు దంపతులకు పూలమాలలు సమర్పించి, స్వామి అమ్మవార్ల పూజలు అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదం అందజేయగా ఈవో, చైర్మన్, శాలువా కప్పి,శ్రీ వీర వేంకట స్వామి వారి ఫొటో, ప్రసాదం, అందజేశారు. తదుపరి శ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతులు రామాలయం, వనదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో వేంద్ర త్రినాథరావు, చైర్మన్ ఐవీ రోహిత్, దామెర్ల క్రిష్ణారావు ఏఈవో, టెంపుల్ ఇన్స్పెక్టర్ గణపతి, ఆర్ ఐ శ్రీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# రేస్ డ్రైవింగ్, హెల్మెట్‌పై ఎస్ఐ దాడులు

**సామర్లకోట, నెల్లూరు, (రాజధాని వార్తలు):** హెల్మెట్ రేస్ డ్రైవింగ్ లైసెన్స్‌లపై సామర్లకోట సిబిఎం సెంటర్లో సామర్లకోట ఎస్సై ఎం.రాజా విస్తృత తనిఖీలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం చేపట్టిన తనిఖీల్లో హెల్మెట్ల లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులను, లైసెన్సులు లేకుండా వాహనాలను నడిపే యువతను, రేస్ డ్రైవింగ్ చేసే యువతను నిలువరించారు. ఈ సందర్భంగా అక్క డక్కడ వాహనదారులకు పోలీస్ యాప్ ద్వారా అపరాధరుసుములను విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరిరాజు సూచనలతో హెల్మెట్లు లేని డ్రైవింగ్, లైసెన్సులో లేకుండా వాహనాలు నడపడం, అతివేగంగా వాహనాలు నడిపే వారిపై చర్యలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



ద్విచక్ర వాహనదారులు ఈ నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ పట్టణ స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరై కాకినాడ రూరల్, కాకినాడ పట్టణం నియోజ కవర్గాలలోని రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని జేసీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు రైతులతో కలిసి నూతన సంవత్సర వేడుక కేక్‌ను కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఈ నెల 2వ తేదీ నుంచి 09 వరకు గ్రామ సభలు నిర్వహించి రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని తెలిపారు. గతంలో రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేసి, ప్రభుత్వ రాజముద్రతో, అత్యాధునిక టెక్నాలజీతో ఈ నూతన పాస్ పుస్తకాలు రూపొందించారన్నారు. కాకినాడ, పెద్దాపురం రెండు డివిజన్లకు కలిపి మొత్తం 1, 35,372 నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు



ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ సమస్యలు లేని రెవెన్యూ వ్యవస్థను తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులకు వారి భూమిపై హక్కు కల్పిస్తూ కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేపట్టిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 18 నెలల నుంచి ఈ అంశంపై విస్తృత కసరత్తు చేసి తప్పులు లేని పాస్ పుస్తకాలను ప్రభుత్వం రైతులకు అందిస్తోందన్నారు. నిజమైన హక్కుదారులకు న్యాయం జరగాలనే రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. గ్రామస్థాయిలో స్థాయిలో రెవిన్యూ అధికారులు (వీఆర్ఓ) రైతులకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే ఇతర కార్యక్రమాలు రైతులను ఎంతగానో ఆందోళనకు గురి చేసాయన్నారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించిందని, వాటిని సరి చేస్తూ కూటమి ప్రభుత్వం రైతులకు ప్రభుత్వ రాజముద్రతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులు అందిస్తోందన్నారు. ఈ పుస్తకాల ద్వారా ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా క్యూ ఆర్ కోడ్‌తో రైతులకు అందించడం మంచి పరిణామని ఆమె తెలిపారు. కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ మాట్లాడుతూ రైతులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు రైతులు ఆస్తులపై రాజకీయ నాయకులు ఫోటోలు వేయడం ఎంతవరకు సమంజసం అని గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేయడం జరిగిందన్నారు. ఈ పోరాటం ఫలితంగానే రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నూతన పట్టాదారు పాస్ పుస్తకాల రూపకల్పనకు శ్రీకారం చుట్టారన్నారు. డూప్లికేట్ పుస్తకాలకు తావులేకుండా పారదర్శకంగా నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు తయారు చేయడం జరిగిందన్నారు. రైతుల భూములకు భద్రత కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని భవిష్యత్తులో కూడా సరిగా లేనివి సరిచేసి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన తెలిపారు. కాకినాడ అర్బన్ శాసన సభ్యులు వనమాడి వేంకటేశ్వరరావు.. రైతులు పక్షాన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసారు. రైతులకు వారి భూములపై యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రైతులు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. గత ప్రభుత్వం ప్రతి కార్యక్రమంలో ప్రజా ప్రయోజనాలు కాక, తమ పార్టీల నాయకులు ఫోటోలు వేసుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సమాజంలో ఆదర్శంగా నిలిచిన, స్ఫూర్తినిచ్చిన వ్యక్తులకు గుర్తింపునిస్తూ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర, మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ వంటి ఆదర్శమూర్తులు పేర్లు పెట్టి మంచి ఒరవడికి నాంది పలికిందన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెడుతున్నారన్నారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఫోటోలు, పెయింటింగ్‌లకు, సరిహద్దు రాళ్ళకు వృధాగా సొమ్ము ఖర్చు చేసి, భారీ మొత్తంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అభివృద్ధిని అందించాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు పాటుపడుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కె అప్పారావు, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ అర్బన్ మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డక్కిలి మండలంలో రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ : డక్కిలి తహసీల్దార్ ఎం. శ్రీనివాసులు









**డక్కిలి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా డక్కిలి మండలంలో రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో అర్హులైన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ ఎం. శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం లింగసముద్రం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో రైతులకు పాసుపుస్తకాలు అందజేశారు. ఏళ్ల తరబడి భూ సరిహద్దులు, రికార్డుల్లోని లోపాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు రీ-సర్వే ప్రక్రియ వరంలా మారిందని ఆయన పేర్కొన్నారు. భూ హక్కులపై స్పష్టత రావడంతో రైతులకు ఆర్థిక భద్రత కలుగుతుందని చెప్పారు. భూ రికార్డుల శుద్ధికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయనేందుకు ఈ కార్యక్రమమే నిదర్శనమని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, భూ హక్కులపై స్పష్టత రావడం ద్వారా రైతులకు రుణాలు, ప్రభుత్వ పథకాలు సులభంగా అందుతాయని అన్నారు. రీ-సర్వే ద్వారా రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరకనున్నదని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు మాట్లాడుతూ, భూ రికార్డుల సవరణ రైతుల జీవితాల్లో దీర్ఘకాలిక మార్పులకు దారి తీస్తుందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన సాగాలని సూచించారు. రీ-సర్వేలో తలెత్తే లోపాలను సకాలంలో సరిదిద్దుకుంటే భవిష్యత్తులో భూ వివాదాలకు తావు ఉండదన్నారు. రైతులు తమ పాసుపుస్తకాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. రీ-సర్వే అమలులో సాంకేతిక, పరిపాలనా సవాళ్లు ఎదురవుతున్నా వాటిని అధిగమించే దిశగా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీతో గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న విశ్వాసం రైతుల్లో నెలకొందన్నారు. గ్రామస్తులు, రైతులు, సంబంధిత అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం భూ పరిపాలనలో సంస్కరణలకు నాంది పలికిందని పలువురు అభిప్రాయపడ్డారు.

రైతుకు భరోసా కల్పించే రీ-సర్వే ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలైతే వ్యవసాయ రంగానికి ఇది మేలైన పరిణామంగా మారుతుందని పేర్కొన్నారు.

# విద్యార్థుల్లో సామాజిక బాధ్యత అవసరం : విసి ఆచార్య అల్లం శ్రీనివాస రావు










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-III ఆధ్వర్యంలో కాకుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య అల్లం శ్రీనివాస రావు మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పాఠశాలల చదువులోనే కాకుండా, సమాజంపై అవగాహన పెంచుకొని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను భారత ప్రభుత్వం గుర్తించి, వరుసగా మూడుసార్లు రాష్ట్రపతి అవార్డులు అందజేసినందుకు విశ్వవిద్యాలయానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో గ్రామస్థులు కూడా ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎన్ఎస్ఎస్ సేవలను విస్తృతం చేసినందుకు సమన్వయకర్త డా.ఉదయ్ శంకర్ అల్లంని ప్రత్యేకంగా అభినందించారు. శిబిరంలో మధ్యాహ్నం వివిధ సామాజిక సమస్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెంకటాచలం ఎంపీడీఓ కల్పన పరిశుభ్రత ఆవశ్యకతను వివరిస్తూ, ఏడు రోజుల శిబిరంలో గ్రామస్థులకు 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్' నివారణపై సంపూర్ణ అవగాహన కల్పించాలని కోరారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. కె.సునీత విశ్వవిద్యాలయం చేపడుతున్న సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్. విజయ సమాజ నిర్మాణంలో విశ్వవిద్యాలయ పాత్రను వివరించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ్ శంకర్ అల్లం రాబోయే 7 రోజులలో చేపట్టనున్న సేవా కార్యక్రమాలు, శిబిర ఉద్దేశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, ప్రెసిడెంట్ ఇన్‌చార్జ్ డి. గౌతమ్, సచివాలయ సిబ్బంది, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, బయోటెక్నాలజీ విభాగం వాలంటీర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర భూసర్వేతో రైతులకు మేలు : ఏ.ఎం.సి చైర్మన్ పి.వి.గోపాలరాజు




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** సమగ్ర భూసర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఏఎంసీ చైర్మన్ పి.వి.వి గోపాలరాజు అన్నారు. భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎం.వెంకటాపురం గ్రామంలో జరిగిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో గోపాలరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా గ్రామంలో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బి.రత్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

# 4వ డ్యాన్స్ ఫెస్టివల్




**విజయనగరం, (రాజధాని వార్తలు):** 4వ తేదీ ఆదివారం నాడు ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో డాన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని సమాఖ్య వ్యవస్థాపకులు సముద్రాల గురు ప్రసాద్ పేర్కొన్నారు. లంక వీధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవ ప్రతులను గేట్ అధ్యక్షురాలు పెనుమజ్జి విజయలక్ష్మితో కలిసి ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రముఖ నృత్య దర్శకుడు బెల్లాన రాజు కొరియోగ్రాఫర్‌గా 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో గీతాంజలి పాఠశాలతో కలిపి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని నాలుగో తేదీ ఉదయం 10 గంటల నుండి కేఎల్ పురం పావని నగర్‌లో గల గీతాంజలి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన డాన్స్ ఫెస్టివల్‌కు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లాస్య డాన్స్ స్టూడియో అధినేత బెల్లాన రాజు, గీతాంజలి విద్యా సంస్థల కరస్పాండెంట్ ఏ శ్రీనివాసరావు, డైరెక్టర్ రాజేష్, ప్రిన్సిపల్ మల్లిక, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అంధ విభిన్నప్రతిభావంతులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు

**కాకినాడ, (రాజధాని వార్తలు):** ఈ నెల 04న ప్రపంచ బ్రెయిలీ డే సందర్భంగా 217వ లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని అంధ విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు శుక్రవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్ ఎన్ఎఫ్సీఎల్ రోడ్, కాకినాడ నందు ఉదయం 10.00 గంటల నుండి నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా ఐఏఎస్, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ ఎస్.పి సత్యనారాయణ, కాకినాడ మునిసిపల్ కమీషనర్ సత్యనారాయణ, జిల్లా ఖజానా శాఖాధికారి గ్రణేష్, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏవీ శ్రీనివాస్, ఈగల్ టీం, వివిధ అంధ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు, సుమారు 150 మంది అంధ విద్యార్థిని విద్యార్థులు, సుమారు 50 మంది అంధ ఉద్యోగులు కాకినాడ, తూర్పు గోదావరి మరియు డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుండి



పాల్గొనడం జరిగింది. రన్నింగ్ 100, 50 మీటర్స్, తగ్గ అఫ్ వార్, చెస్, క్రికెట్, గెలుపొందిన వారికి జనవరి 4, 2026న లూయి బ్రెయిలీ జన్మదినోత్సవ కార్యక్రమంలో బహుమతులు గౌరవ అతిథులచే అందజేయడం జరుగుతుంది.

# పది పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్దపడాలి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మార్చి నెలలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావడం ద్వారా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని స్పెషల్ ఆఫీసర్ బి లక్ష్మీ కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక పిఎం శ్రీ మున్సిపల్ హైస్కూల్ అయోధ్య రామపురంలో జరుగుతున్న ప్రత్యేక తరగతులను సందర్శించారు. 100 రోజుల ప్రణాళిక అమలు, డైలీ టెస్టుల నిర్వహణ, మార్కులు విశ్లేషణ, రెమెడియల్ టీచింగ్‌లను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ రానున్న రెండు నెలల కాలం చాలా కీలకం అని, విద్యార్థులు టివిలకు, మొబైల్‌లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్ధి భవిష్యత్తుకు పదో తరగతి చాలా కీలకమని ఆమె అన్నారు. ఎప్పటికప్పుడు సందేహాలను టీచర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ప్రతి పాఠశాలకి పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్‌లను నియమించారని, తనను ఈ పాఠశాలకు నియమించడంతో వారంలో రెండు సార్లు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించడం, నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు. హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణతో కలిసి టీచర్ల రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సోషల్ టీచర్లు పి.బ్రహ్మానందం, ప్రవీణ, త్రివేణి, దుర్గ ప్రసాద్ తదితరులున్నారు.



# సంపాదకీయం

## భారత్ భావనకు 'విద్వేష' ఉపద్రవం

నూతన సంవత్సర శుభాకాంక్షలు. గతించిన సంవత్సరం (2025)లో మీ మనసుపై ముద్ర వేసిన ప్రభావం లేదా ఘటన ఏమిటి? శాశ్వతంగా నిలిచిపోయే దాని జ్ఞాపకాన్ని సువ్యక్తం చేసే పదం ఏమిటి? ఈ సువిశాల దేశంలో అత్యధిక ప్రజలను కదిలించిన మాట ఏమిటి? 2025 సంవత్సరం మనలో మిగిల్చిన మన్నికైన జ్ఞాపకం 'సిందూర్'. పహల్గాంలో అమానుష ఉగ్రవాద దాడికి పాల్పడింది ముగ్గురు పాకిస్థానీ చొరబాటుదారులు. ఈ పాకిస్థానీ దుండగులకు ఆశ్రయమిచ్చి, వారి ఘాతుకానికి సహకరించినది ఇద్దరు భారతీయులు అని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వెల్లడించింది. పహల్గాం హత్యాకాండకు భారత ప్రభుత్వ ప్రతిస్పందనే 'ఆపరేషన్ సిందూర్'. ఈ సైనిక చర్యలో భారత వాయుసేన, క్షిపణులు, డ్రోన్‌లు పాకిస్థాన్ సైనిక స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించాయి. మన దేశానికీ కొంత నష్టం సంభవించింది (ఏ యుద్ధంలోనైనా ఇది అనివార్యం). ముగ్గురు పాకిస్థానీ చొరబాటుదారులు ఒక ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఎన్ఐఏ అరెస్ట్ చేసిన ఇద్దరు భారతీయుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ఆపరేషన్ సిందూర్ నిర్వహణ, సాధించిన ఫలితాలపై ఇప్పటికీ పారదర్శకత కొరవడింది. కేవలం నాలుగు రోజులు మాత్రమే జరిగిన 'ఆపరేషన్ సిందూర్' దేశ ప్రజల మనసులపై శాశ్వత ప్రభావం కలిగించేంత సుదీర్ఘ యుద్ధం కాదు. 2025లో భారత్‌ను నిర్వచించేందుకు యుక్తమైన మరో పదం 'టారిఫ్'. ఆ సేతు హిమాచలం అశేష ప్రజల మాటామంతీ, పిచ్చాపాటీలో ప్రస్తావితమైన, ఇంకా ప్రస్తావితమవుతోన్న పదమది. దానికి దీటైన మరొక పదం 'ట్రంప్' మాత్రమే! ట్రంప్ టారిఫ్‌లు అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలను సంక్లిష్ట సమస్యల్లోకి నెట్టివేశాయి. చాలా దేశాల్లో ఈ సమస్యలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఉదాహరణకు అమెరికాకు భారత్ ఎగుమతులపై ప్రతీకార సుంకాలు, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు జరిమానా విధింపులు కొనసాగుతున్నాయి. అమెరికాకు భారత్ చేస్తున్న-ఉక్కు, అల్యూమినియం, జౌళి ఉత్పత్తులు, ముత్యాలు, ఆభరణాలు, సముద్ర ఆహార ఉత్పత్తులు, రసాయనాల ఎగుమతులను ట్రంప్ సుంకాలు ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా, భారత్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం 'సమీప భవిష్యత్తు'లో కుదరనున్నదని 2025 ఏప్రిల్‌లో వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ ప్రకటించారు. 2025 సంవత్సరం ముగిసిపోయింది. ఇప్పటికీ ఆ ఆశావహ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చాలా సుదూర విషయంగానే కనిపిస్తోంది మరి. జీఎస్టీ (వస్తుసేవల పన్ను) మరొక యుక్తమైన పదంగా చెప్పవచ్చు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఈ పన్ను వ్యవస్థ ప్రారంభమయింది. వినియోగదారులకు, వ్యాపార వర్గాలకు అదొక ఉపద్రవం. సముచిత సలహాలు, సూచనలకు కేంద్ర ప్రభుత్వం ఆలస్యంగానే అయినప్పటికీ సానుకూలంగా ప్రతిస్పందించింది. చాలా సరుకులు, సేవలపై జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించింది. అయినప్పటికీ వర్తకులు, వ్యాపారులు, వాణిజ్యవేత్తలకు పాలనా యంత్రాంగాల నుంచి వేధింపులు, చికాకులు తప్పడం లేదు. కొంతమంది వ్యాపారులు అయితే ఇప్పటికీ జీఎస్టీ విషయంలో తికమక పడుతూనే ఉన్నారు. జీఎస్టీ చట్టాలకు అనుగుణంగా వ్యవహరించడంలో తమకు ఎదురవుతున్న కష్ట నష్టాలకు వర్తకులు, వ్యాపారులు ఎంతో మంది గుండెలు బాదుకుంటూనే ఉన్నారు. కొన్ని ముఖ్యమైన సరుకులపై పన్ను రాయితీ కల్పించారు. అయితే వాటి వినియోగ పరిమాణంతో పోల్చితే ఆ రాయితీ చాలా స్వల్పమైనది మాత్రమే. జీఎస్టీపై ఇచ్చిన రాయితీలతో వినియోగం ఇతోధికంగా పెరుగుతుందని ప్రభుత్వం భావించింది. అయితే దేశ జనాభాలో అధిక ఆదాయమున్న పదిశాతం ప్రజల వినియోగం మాత్రమే పెరిగింది. చెప్పవచ్చిన దేమిటంటే జీఎస్టీ ఇప్పటికీ సామాన్య వినియోగదారులకు చికాకు కలిగిస్తూనే ఉన్నది. 2025 సంవత్సరం భారత ఆర్థిక వ్యవస్థకు 'Goldilocks year' (స్థిరమైన, మితమైన వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం, తక్కువ నిరుద్యోగంతో ఆర్థిక వ్యవస్థ వర్ధిల్లిన అరుదైన సంవత్సరం) అని ప్రభుత్వం ఆరాటంగా చాటింది. అయితే ఈ ప్రచారారాటం చాలా త్వరితంగానే అంతరించిపోయింది. ఆ ఘనమైన మాట-గోల్డిలాక్స్ ఇయర్' సూచించే విషయాలు విద్యాధికులకే అపరిచితమైనవి. దీనికి తోడు దేశ జాతీయ గణాంకాల విశ్వసనీయతను అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ ప్రశ్నించింది. దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనతల గురించి మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు మొదలు అర్థశాస్త్ర ఘనాపాటీలు అయిన విశ్వవిద్యాలయాల ఆచార్యుల వరకూ ఎందరో మాట్లాడారు. అయితే ఉద్యోగాలకై యువజనులు చేసిన ఆందోళనలతో ప్రభుత్వ ప్రాయోజిత 'గోల్డిలాక్స్ ఇయర్' ప్రచారం నిలిచిపోయింది. నిజానికి ప్రధాన ఆర్థిక మాజీ సలహాదారు, తదితరులు చెబుతున్న వాటికంటే చాలా బలహీనతలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఉన్నాయి. వాటిని అంగీకరించేందుకు ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఇంకా చెప్పాలంటే... బహుశా, ఆ బలహీనతలను అర్థం చేసుకునేందుకు సైతం ప్రభుత్వం నిరాకరిస్తోంది. సరే, ఒకప్పుడు అందరూ 'లౌకికవాదం' అనే పదాన్ని ప్రస్తావిస్తుండేవారు. లౌకికవాద విలువల గురించి మాట్లాడుతుండేవారు. అయితే ఇప్పుడు ఆ పదం ఎక్కడా విన్పించడం లేదు. తమనుతాము లౌకికవాదులుగా చెప్పుకునే వారి సంఖ్య అంతకంతకూ తగ్గిపోతోంది. రాజ్య వ్యవస్థ కార్యకలాపాల నుంచి మత ప్రమేయ వ్యవహారాలను వేరు చేయడమే లౌకికవాదం. అయితే మత సిద్ధాంతాలపై కాకుండా హేతువు, మానవతావాదంపై లౌకికవాది విలువలు ఆధారపడి ఉంటాయనే అర్థాన్ని ఆ పదం కాలక్రమేణా సంతరించుకున్నది. లౌకికవాద విలువల, విశ్వాసాల తిరోగమనం విద్వేషం ప్రబలిపోయేందుకు దారి తీసింది. ప్రతి మతమూ గర్హించిన మానవ స్వభావమది.

# సినీ రంగంలో రాణించాలంటే టాలెంట్‌తో పాటు అదృష్టం తోడవ్వాలి

- విశాఖలో అనేకమంది నటీనటులు సాంకేతిక నిపుణుల, దర్శకులు చలనచిత్ర రంగంలో గొప్ప స్థాయిలో ఉన్నారు - విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్
- ఉత్తరాంధ్ర కళాకారులను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు సాధిస్తారు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సినీ రంగంలో రాణించాలంటే టాలెంట్‌తో పాటు అదృష్టం తోడవ్వాలి తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నిర్మాత సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ పౌర గ్రంథాలయంలో 2025 లో విడుదలైన కన్యాకుమారి చిత్ర ఉచిత ప్రదర్శన, చిత్ర నటీనటులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తాను సైతం సినీ రంగంలో అభిరుచికి తగ్గట్టుగా చిత్రాలు నిర్మించానని, ప్రస్తుతం సినీ రంగంలో ఉన్నత స్థానంలో ఉన్న దర్శకులు నటీనటులు, సాంకేతిక నిపుణులు సైతం తాను సహాయ సహకారాలు అందించానని తెలిపారు. ప్రతిభ ఉంటే సాధించలేనిది అంటూ ఏమీ లేదని అయితే సినీ రంగంలో మాత్రం ప్రత్యేకంగా కొంచెం అదృష్టం కూడా ఉండాలి అన్నారు. గొప్ప చిత్రాలను సందేశాత్మక చిత్రాలను ఉచితంగా ప్రదర్శిస్తూ సినిమా అంటే ఏది టేకింగ్ అంటే ఏంటి అంశాలను ప్రజలకు ఉచితంగా తెలియజేస్తున్న వైద్య ఫిలిమ్స్ సొసైటీని ఆయన అభినందించారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్రాకు చెందిన అంశాలను చిత్రంలో గొప్పగా చూపించారని తెలియజేశారు. ఉత్తరాంధ్రలో కళాకారులకు ఎంతో ప్రతిభ పాట వాళ్ళు ఉన్నాయని అయితే అనుకున్నంత మేర అవకాశాలు రావడం లేదని తెలిపారు. రచయిత అట్టాడ సృజన్ చిత్రాన్ని గొప్పగా తీశారని కొనియాడారు. పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చునని పేర్కొన్నారు.

తదుపరి చిత్ర దర్శకుడు అట్టాడ సృజన్ హీరో శ్రీ చరణ్, హీరోయిన్ గీత సైనిను అతిథులు ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమానికి వైజాగ్ ఫిలిమ్స్ సొసైటీ అధ్యక్షుడు ఏ కాశీ విశ్వేశ్వరరావు, కార్యదర్శి నరవ ప్రకాశరావు, నిర్వాహక కార్యదర్శి బి చిన్నారావు, ఆర్.శివకుమార్, ఉపాధ్యక్షురాలు ఉషారాణి, కోశాధికారి హుస్సేన్, రచయిత మేడా మస్తాన్ రెడ్డి, సీత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సుడిగాలి పర్యటన





**యలమంచిలి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్ ప్రతాప్ రెడ్డి శుక్రవారం జిల్లాలో యలమంచిలి, అచ్చుతా పురం నియోజకవర్గల్లో సుడిగాలి పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా ఎలమంచిలి పట్టణంలోని అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో ఉన్న బాలల సంఖ్య, వారికి అందజేస్తున్న ఆహారం మరియు ఆహార నాణ్యత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమయానికి తాజా ఆహారం అందేలా మరియు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలంటూ సిబ్బందికి సూచనలు చేశారు. తదుపరి పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. అక్కడ మధ్యాహ్న భోజన తయారీ ప్రదేశం, వంటశాలను పరిశీలించి, సిబ్బందిని వివిధ అంశాలపై ప్రశ్నించారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వ నిర్దేశిత విధానాల ప్రకారం సరిపడా భోజనం అందించాలని ఆదేశించారు. భోజనం సమయంలో పాఠశాల ఉపాధ్యాయులు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆపై స్థానిక గురుకులంలో మిడ్డే మీల్ (మధ్యాహ్న భోజన) పథకం అమలు పరిస్థితులను పరిశీలించారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులందరు భోజనం పూర్తి చేసే వరకు అక్కడే ఉండి పర్యవేక్షణ చేశారు. అదేవిధంగా అచ్చుతాపురం మండలంలోని కెజిబివి పాఠశాల, గిరిజన, సాంఘిక సంక్షేమ హాస్టల్‌లలో ఉన్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి భోజన సమయంలో కూడా పర్యవేక్షణ నిర్వహించారు. చైర్మన్ వెంట జిల్లా సివిల్ సప్లై అధికారి కెఎల్ఎన్ మూర్తి, జిల్లా విద్యా శాఖ అధికారి జి అప్పారావు నాయుడు, ఐసిడిఎస్ పిడి సూర్య లక్ష్మి ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత అందరిపై ఉంది : డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందని విశాఖ దక్షిణ నియోజక వర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. అల్లిపురం నేరెళ్ల కోనేరు అంగన్వాడి కేంద్రంలో బాల్యవివాహాలు నిషేధం అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ బాల్య వివాహం సాంఘిక దురాచారమని చెప్పారు. 18 సంవత్సరాల వయస్సు నిండకుండా బాలికలకు ఎట్టి పరిస్థితుల్లో వివాహం చేయరాదని తెలిపారు. ప్రతి బాలిక ఒక రోల్ మోడల్గా ఎదగాలని, పురుషులతో సమాన అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. మంచి భవిష్యత్ కోసం బాలికలు బాగా చదవాలన్నారు. ప్రభుత్వం ఉచిత విద్య, భోజన, వసతి ఏర్పాటు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. బాలికలకు జీవితంలో మంచి భవిష్యత్‌ను ఇచ్చేది విద్య మాత్రమేనని చెప్పారు. ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే బాగా చదువుకోవాలన్నారు. బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యంగా అందరు కృషి చేయాలన్నారు. బాలికలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవ్వాన్నారు. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం



కలిగిస్తుందన్నారు. శారీరకంగా, మానసికంగా ఎదుగుదల వచ్చాక వివాహాలు చేసుకోవాలని సూచించారు. ఎవరైన వేధింపులకు గురి చేస్తే 1098 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ లక్ష్మి, అంగన్వాడి టీచర్లు లక్ష్మి మంగరాజు, టీ.పార్వతి, మహిళా పోలీసులు హైమ, వరలక్ష్మి, ఏఎన్ఎంలు ప్రభావతి, విజయలక్ష్మి, సుందరికాంతం, కే. అప్పారావు, కే.కృష్ణ వై. ఆది బాబు, సిపిఐ బుజ్జి, అంగన్వాడి ఆయా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ మండలం, తమ్మవరం పంచాయతీ ప్రాంగణంలో రూరల్ ఎం ఆర్ ఓ ఎస్ ఎల్ ఎన్.కుమారి ఆధ్వర్యంలో నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను పంపిణీ చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భూమి రీసర్వే పూర్తి చేసి, కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీని ప్రారంభించిందని, జనవరి 2 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ పథకం రైతుల హక్కులను రక్షించడానికి, భూమి వివాదాలను పరిష్కరించడానికి ఉద్దేశించబడిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే పంతం నానాజీల చొరవతో తమ సమస్యలు పరిష్కరింపబడ్డాయి రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెంకె శ్రీనివాస్‌బాబా, చప్పిడి వెంకటేశ్వరరావు, శిరంగు శ్రీనివాస్, రంభాల వెంకటేశ్వరరావు, నూరుకుర్తి వెంకటేశ్వరరావు మాదారపు తాతాజీ, కరెడ్ల గోవింద్, గొల్లపల్లి వెంకటరమణ, గొల్లపల్లి బాబీ, గొల్లపల్లి నాగేశ్వరరావు, దెయ్యాల హరిబాబు, పెంకే కిషోర్, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేళంగిలో హిందూ సమ్మేళన మహా సమావేశానికి ఏర్పాట్లు పూర్తి



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం వేలంగి గ్రామంలో ఈనెల 4వ తేదీన ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు హిందూ సమ్మేళన మహాసమా వేశాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వేళంగి నిర్వహణా సమితి అధ్యక్షుడు, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బొండా వెంకన్నారావు తెలిపారు. వేళంగిలో శుక్రవారం జరిగిన హిందూ సమ్మేళనం ఆహ్వాన కరపత్రాల ఆవిష్కరణ, విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ఆర్ఎస్ఎస్ స్థాపనకు వందేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్ సంయుక్తంగా సమావేశాలు నిర్వహిస్తోందని తెలిపారు. వేళంగి సమావేశంలో కాకినాడ శ్రీపీఠం స్వామి పరిపూర్ణానంద స్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. హిందువుల ఐక్యత లేకపోవడంతోనే విదేశీయులు దేశాన్ని ఆక్రమించారని, కుల మతాలకు అతీతంగా ఐకమత్యంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన హెచ్చరించారు. యానాం ఖండ్ పరిధిలోని కరప మండల గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా ఇంటింటికీ పర్యటించి, మహిళలకు బొట్టు పెట్టి విస్తృత ప్రచారం చేస్తామని తెలిపారు. మహిళా ఉపాధ్యక్షురాలు విజయభారతి మాట్లాడుతూ దేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను మారుమూల ప్రాంతాల్లో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తల ద్వారా ప్రచారం చేయాలని కోరారు. యానాం ఖండ్ అధ్యక్షుడు ఎంవీ రామారావు, తలాటం భీమశంకర రావు, శాఖా శ్రీనివాస్, బొండా సూర్యనారాయణ, ఎర్రా విక్రమ్, డి. ఈశ్వరశర్మ, ఇళ్ల ఆదేశ్, గరగ రామయ్య, డాక్టర్ బొండా సూర్యారావు, పోలిశెట్టి తాతీలు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీకి ఘన సన్మానం

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ముదిరాజ్ సంఘం నూతన కమిటీలో పదవులు పొందిన నాయకులకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని సరోజినీదేవి కళ్యాణ మండపంలో వివిధ పదవులు పొందిన నాయకులకు ముదిరాజ్ సంఘం తరఫున గురుమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాగా సన్మానం చేసిన వారిలో తిరుపతి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రమణయ్య, ముది రాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లారి బత్తినయ్య, తంగేళ్ళ పాలెం సింగిల్ విండో చైర్మన్ భీమాల భాస్కర్, తొట్టంబేడు మండల టీడీ పీ ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రమణ్యం, కట్టపుట్టాలమ్మ చైర్మన్ పాడి.రాజేంద్ర, రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్యదర్శి అల్లిపూడి. వెంకటేశ్వర్లు, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు సామ.అంకయ్య,డిసిసి బ్యాంక్ డైరెక్టర్ కూనాటి.నాగరాజు, అఖిల భారతీయ కూలీ ముదిరాజ్ తిరుపతి చైర్మన్ కుర్రకాల్వ వేణు, వడమాలపేట మండల వీఆర్వోల సంఘం ప్రెసిడెంట్ పి. చంద్రబాబు, ఏపీ మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు స్టేట్ డైరెక్టర్ తేరని. జయరాం రెడ్డి, రేణిగుంట మండల టీఎన్టియుసి అధ్యక్షులు కుట్రపాక.శీను తదితర నాయకులకు ముదిరాజ్ సంఘం తరపున పూలమాలాలు వేసి దుశ్శాలువాలతో జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు.

# బెల్లంకొండ.. హైందవ'తో మరో పవర్ ఫుల్ లుక్!




టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కెరీర్ ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో ఉంది. నిర్మాత బెల్లంకొండ సురేష్ వారసుడిగా ఎంట్రీ ఇచ్చినా, తనకంటూ ఒక సపరేట్ మాస్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. మధ్యలో 'ఛత్రపతి' హిందీ రీమేక్ కోసం టాలీవుడ్‌కి గ్యాప్ ఇచ్చిన బెల్లంకొండ, 2025లో మాత్రం స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇచ్చారు. ఈ ఒక్క ఏడాదే రెండు సినిమాలతో పలకరించి ఆడియన్స్‌కు దగ్గరయ్యారు. 2025 మే నెలలో వచ్చిన 'భైరవం' కమర్షియల్‌గా యావరేజ్ అనిపించుకున్నా, నటుడిగా బెల్లంకొండకు మంచి మార్కులు పడ్డాయి. ఆ వెంటనే వచ్చిన హారర్ కామెడీ 'కిష్కింధపురి' మాత్రం బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ చేసింది. కౌశిక్ పెగల్లపాటి డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచి, బెల్లంకొండకు చాలా కాలం తర్వాత ఒక సాలిడ్ సక్సెస్‌ను అందించింది. దీంతో ఇప్పుడు ఆయన లైనప్‌పై ఇండస్ట్రీలో ఆసక్తి పెరిగింది. అయితే హ్యాట్రిక్ కొడతాడు అనుకున్న టైమ్‌లో 'టైసన్ నాయుడు' సినిమా కాస్త డిలే అయ్యింది. ఈ సినిమాను 2026 సమ్మర్ రేస్‌లో దించే ప్లాన్‌లో ఉన్నారు. ఇదిలా ఉంటే, బెల్లంకొండ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భరేగా ఒక అదిరిపోయే సర్ ప్రైజ్ ఇచ్చారు. తన కొత్త సినిమాకు సంబంధించి మరో పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమాకు 'హైందవ' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే.

పోస్టర్ డిజైన్, టైటిల్ ఫాంట్ చూస్తుంటేనే ఇదొక మిస్టరీ యాక్షన్ సినిమా అని అర్థమవుతోంది. మూన్ షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై లధీర్ బైరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, మహేష్ చందు దర్శకత్వం వహిస్తున్నారు. రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా ఇంటెన్స్‌గా ఉంది. అన్నింటికంటే హైలైట్ ఏంటంటే.. హీరో వెనకాల దశావతారాల్లో ఒకటైన వరాహ రూపం ఉగ్రంగా కనిపిస్తుండటం. హీరో చేతిలో కాగడా, గొడ్డలి పట్టుకుని నీటిలో ఉన్న ఒక పురాతన స్తంభంపై నిల్చొని ఉండటం చూస్తుంటే గూస్ బంప్స్ వస్తున్నాయి. క్యాప్షన్ లో "సత్యాన్వేషణలో అతను ఒంటరి కాదు.. దశావతారాలు అతనికి అండగా ఉంటాయి" అని చెప్పడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ మధ్య కాలంలో 'కాంతార', 'హనుమాన్', 'కార్తికేయ 2' లాంటి దైవ సంబంధిత కథలకు పాన్ ఇండియా రేంజ్ లో క్రేజ్ పెరుగుతోంది. ఇప్పుడు బెల్లంకొండ కూడా అదే ట్రెండ్‌ని ఫాలో అవుతూ, డివైన్ టచ్ ఉన్న యాక్షన్ కథను ఎంచుకున్నట్లు క్లియర్‌గా తెలుస్తోంది. 'శ్యామ్ సి ఎస్' సంగీతం అందిస్తున్న ఈ సినిమా బెల్లంకొండ కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ అయ్యే ఛాన్స్ ఉంది.

# ఎరుపు చీరలో ప్రభాస్ బ్యూటీ అందాలు.. స్టైల్‌తోనే కట్టిపడేస్తూ..



సోషల్ మీడియా.. ఎంతోమంది పాపులారిటీకి అతిపెద్ద ఫ్లాట్ ఫారం అని చెప్పవచ్చు. ఈ సోషల్ మీడియా ద్వారా తమ టాలెంట్ ను నిరూపించుకొని.. సినిమాలలో అవకాశాలు అందుకుంటూ మరింత పాపులారిటీ సొంతం చేసుకుంటున్నారు. అయితే ఇలా సోషల్ మీడియా ద్వారా వచ్చిన పాపులారిటీతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టినప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్ గానో లేదా చిన్న హీరోల పక్కన హీరోయిన్‌గానో అవకాశం లభిస్తుంది. కానీ ఇక్కడ సోషల్ మీడియా ద్వారా పాపులారిటీ సంపాదించుకున్న ఒక సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌కి ఏకంగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఫౌజీ మూవీలో అవకాశం లభించిందని తెలిసి ఓవర్ నైట్‌లోనే ఈమె స్టార్ అయిపోయింది. ఆమె ఎవరో కాదు ఇమాన్వి ఎస్మాయిల్. సీతారామం సినిమాతో భారీ పాపులారిటీ సంపాదించుకున్న హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న చిత్రం ఫౌజీ. ఇప్పటికే షూటింగ్ కూడా మొదలయ్యింది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పైన నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 1940ల నేపథ్యంలో యుద్ధం, న్యాయం ఆధారంగా రాబోతున్న ఈ పీరియాడిక్ డ్రామా మూవీ ఆగస్టు 2026లో థియేటర్లలో విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇందులో హీరోయిన్‌గా అవకాశాన్ని దక్కించుకుంది ఇమాన్వి. ఇకపోతే ఒక సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ ను ప్రభాస్ పక్కన హీరోయిన్‌గా తీసుకోవడం ఏంటని చాలామంది విమర్శలు గుప్పించారు. కానీ ఆమె ఇంస్టా ఐడి చూసిన తర్వాత చాలామంది ఆమె టాలెంట్‌కు ఫిదా అయిపోయారు. ఆమె ఒక క్లాసికల్ డాన్సర్. ఇక నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ప్రేక్షకులను ఆకట్టుకునే ఇమాన్వి తాజాగా ఎరుపు రంగు చీర కట్టుకొని తన అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎరుపు రంగు చీరలో ప్రభాస్ బ్యూటీ అదుర్స్ అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇమాన్వి ఢిల్లీలో పుట్టింది. డాన్స్ అంటే చాలా ఇష్టం. ఎంబీఏ పూర్తి చేసిన ఈమె నృత్యం పట్ల అభిరుచిని వదులుకోకుండా నిత్యం ప్రాక్టీస్ చేస్తూ కొత్త తరహా రీతిలో డాన్స్ చేస్తూ మరింత పాపులారిటీ అందుకుంది. ఈమె ఆసక్తిని గమనించిన ఈమె తండ్రి ఒక యూట్యూబ్ ఛానల్ పెట్టేందుకు ప్రోత్సహించారు. దీంతో ఈమె ఉద్యోగానికి కూడా రాజీనామా చేసి ఫుల్ టైం డాన్సర్‌గా మారిపోయింది. అటు ఈవెంట్లు, రీల్సు ఇదే ప్రపంచంగా మారిపోయింది. ఇప్పటికే 7 లక్షలకు పైగా ఫాలోవర్స్‌ను సొంతం చేసుకున్న ఈమె తల్లి సహకారంతో మరింత ముందుకు వెళ్తోంది. ముఖ్యంగా ఎక్స్ప్రెషన్స్ విషయంలో ఇమాన్వి తర్వాతే ఎవరైనా.. అంత అదుతేంగా ఎక్స్ప్రెషన్స్ ఇస్తూ లక్షలాది మంది అభిమానులను దక్కించుకుంది.

సినిమాల్లోకి రాకముందే సోషల్ మీడియా ద్వారా భారీ పాపులారిటీ అందుకున్న ఈమెకు.. ఏకంగా ప్రభాస్‌లాంటి హీరో పక్కన అవకాశం లభించింది. ఒకవేళ ఈ సినిమా గనుక మంచి విజయం అందుకుంది అంటే కచ్చితంగా టాలీవుడ్‌లో ఈమెకు ఆఫర్లు క్యూ కడతాయనడంలో సందేహం లేదు. అయితే ఇదంతా ఎంతో దూరం లేదు అని చెప్పవచ్చు ఏది ఏమైనా మొదటి సినిమాతోనే పాన్ ఇండియా లెవెల్‌లో ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధ మైన ఇమాన్వికి త్వరలో వరుస అవకాశాలు తలుపుతాడ తాయని సినీ విశ్లేషకులు కూడా చెబుతున్నారు.


# అలాగైతే దీపిక, కియారా కూడా కష్టమే!



కొంత కాలంగా ఇండస్ట్రీలో హవా ఎవరిది అంటే పెళ్లైన భామలు..తల్లులుగా ప్రమోట్ అవుతున్న వారి పేర్లే వినిపిస్తున్నాయి. దీపికా పదుకొణే, కియారా అద్వానీ, అలియాభట్, కీర్తి సురేష్, నయనతారతో పాటు ఇంకొంత మంది డిమాండింగ్ భామలుగా హైలైట్ అయ్యారు. పెళ్లైన తర్వాత వారి మార్కెట్ రెట్టింపు అయిందని...కొత్త అవకాశాలన్నీ వారికే ఎక్కువగా వస్తున్నాయని సర్వేలు సైతం తేల్చాయి. పెళ్లిని ఓ సెంటిమెంట్‌గా భావించి అవకాశాలు ఇచ్చే దర్శక, నిర్మాతలు పెరిగారని మీడియా కథనాలు అంతకంతకు వెడెక్కించాయి. వీళ్ల వేగం చూసి ఇప్పట్లో ఎదురెళ్లడం కూడా కష్టమన్నట్లు మిగతా భామలు ఓ అంచనాకి వచ్చేసినట్లు ప్రచారం జరిగింది. కానీ అసలు సంగతి ఏంటి అంటే పెళ్లి అవ్వడం వరకే. పెళ్లి అయిన తర్వాత తల్లి కూడా అయితే? నటిగా మునుపటి అంత వేగంగా పని చేయలేము? అన్నది అలియాభట్ అభిప్రాయంగా చెప్పుకొచ్చింది. తల్లైన తర్వాత తాను సినిమాలు తగ్గించానని...ఇప్పుడు అంత యాక్టివ్‌గా పనిచేయలేకపోతున్నానని తెలిపింది. ముఖ్యంగా యాక్షన్ నేపథ్యం గల చిత్రాలు చేయాలంటే ఎక్కువ ఎనర్జీ ఖర్చు అవుతుందని.. టేక్‌ల మీద టేకులు తీసుకుంటే అలసట తొందరగా వస్తుందని ఆ కారణంగానే తాను సినిమాలు తక్కువగా చేస్తున్నట్లు తెలిపింది. ఇటీవలే దీపికా పదుకొణే కూడా 'కల్కీ 2' నుంచి ఎగ్జిట్ అయిన సంగతి తెలిసిందే. ఇదీ భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్. సుమతి పాత్ర కోసం దీపిక కూడా ఎక్కువగానే శ్రమించింది. గర్భవతి పాత్రలో దీపిక ఎఫెర్ట్ అంతా తెరపై కనిపించింది. మొదటి భాగంలో కనిపించింది కాసేపే అయినా రెండవ భగంలో దీపిక పోర్షన్ ఎక్కువగా ఉంటుంది. కానీ దీపిక 'కల్కి 2' నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. అధిక పని గంటలు పని చేయాలని నిర్మాతల డిమాండ్ అందుకు అధిక పారితోషికం చెల్లించాలని దీపిక డిమాండ్ చేయడం తెలిసిందే. దీపికా పదుకొణే ఎగ్జిట్‌ని పరిశీలిస్తే అలియా భట్ చెప్పినట్లు 'కల్కి 2' శ్రమను తట్టుకోలేక దీపిక ఎగ్జిట్ అవ్వడానికి మరో కారణం కూడా అయి ఉండొచ్చు. దీపిక కూడా తల్లైన నేపథ్యంలో మునుపటిలా సినిమాలు చేయడం లేదు. ఆచితూచి ప్రశాంతంగా ఉండే కాన్సెప్ట్‌లనే ఎంచుకుంటున్నారు. అలాగే కియారా అద్వాణీ కూడా వేగం తగ్గించి సినిమాలు చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే.

దీని వెనుక తాను కూడా తల్లి కావడంతోనే ఈ నిర్ణయం తీసుకుందా? అన్న సందేహం రాకమానదు. దీపిక, కియారాలు కూడా ఇకపై భారీ యాక్షన్ సన్నివేశాలున్న చిత్రాల్లో నటించడం చాలా అదరుదుగానే జరుగుతుందేమో.

# ఆ ఐటెమ్ సాంగ్‌లో ఆమె కాదు, మన తెలుగమ్మాయే!



ఐటెమ్ సాంగ్స్ కు ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. అయితే ఈ మధ్య ఐటెమ్ సాంగ్స్‌నే స్పెషల్ సాంగ్స్ అని కూడా అంటున్నారు. ఒకప్పుడు ఐటెమ్ సాంగ్స్ చేయడం కోసం ప్రత్యేకంగా కొందరు భామలుండేవారు. కానీ ఇప్పుడలా కాదు. ట్రెండ్ మారింది. హీరోయిన్లతోనే వాటిని చేయించి దాన్ని స్పెషల్ సాంగ్ అంటున్నారు. ఎప్పుడైతే హీరోయిన్లు కూడా ఈ సాంగ్స్ చేసే ట్రెండ్ మొదలైందో అప్పట్నుంచి వాటికి డిమాండ్ బాగా పెరిగింది. ఇప్పటికే పలువురు హీరోయిన్లు భారీ బడ్జెట్ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసి మరింత పాపులర్ అయ్యారు. అయితే ఈ ఐటెమ్ సాంగ్స్ క్రేజ్ ను గుర్తించిన మేకర్స్ చాలా వరకు తమ సినిమాల్లో కూడా అలాంటి సాంగ్స్ పెట్టి ఆడియన్స్‌ను ఎట్రాక్ట్ చేయాలని చూస్తున్నారు. ఇక అసలు విషయానికొస్తే ఈ ఇయర్ సంక్రాంతికి పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడటానికి రెడీ అవుతున్నాయి. అందులో ది రాజా సాబ్, మన శంకర వరప్రసాద్ గారు, భర్త మహాశయులకు విజ్ఞప్తి, అనగనగా ఒక రాజు, నారీ నారీ నడుమ మురారి సినిమాలు రిలీజ్ కానున్నాయి. ఈసారి పండగకి బాక్సాఫీస్ వద్ద భారీ పోటీనే నెలకొంది. అయితే ఈ పండగ సినిమాల్లో ఒక్క సినిమా తప్పించి మిగిలిన ఏ మూవీలోనూ ఏటెమ్ సాంగ్ లేదు. ఆ సినిమా మరేదో కాదు, అనగనగా ఒక రాజు. జనవర 14న అనగనగా ఒక రాజు నవీన్ పోలిశెట్టి హీరోగా, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా మారి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ కామెడీ ఫ్యామిలీ ఎంటర్టైనర్ సంక్రాంతి సందర్భంగా జనవరి 14న రిలీజ్ కానుంది.

రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇప్పటికే చిత్ర యూనిట్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేయగా, తాజాగా ఈ సినిమాలో ఐటెమ్ సాంగ్ ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందని, ఆ సాంగ్‌లో సౌత్ బ్యూటీ రాశీఖన్నా నటించనుందని వార్తలొచ్చాయి. కానీ తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఐటెమ్ సాంగ్ ఉన్న మాట నిజమే కానీ, ముందుగా వార్తలొచ్చినట్టు అందులో రాశీఖన్నా కాకుండా, మన తెలుగమ్మాయి శాన్వీ మేఘన కనిపించనుందని తెలుస్తోంది. మరి ఈ సాంగ్ ఏ మేరకు ఆకట్టుకుంటుందో, నవీన్ ఈ పండగకు ఎలాంటి ఫలితాన్ని అందుకుంటారో చూడాలి. కాగా ఈ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో నాగవంశీ నిర్మించిన సంగతి తెలిసిందే.

# సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలకు సీతం విద్యార్థి ఎంపిక




**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజుల రేగ పరిధిలో గల సీతం కళాశాలలో మొదటి సంవత్సరం బిటెక్ సిఎస్సి బ్రాంచ్ చదువుతున్న వై జస్వంత్ రెడ్డి జనవరి ఒకటవ తేదీన రఘు ఇంజనీరింగ్ కళాశాల వారి ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్ కళాశాలల పురుషుల బ్యాడ్మింటన్ పోటీలలో అత్యుత్తమ నైపుణ్యం ప్రదర్శించి జేఎన్టీయూ గురజాడ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి తెలిపారు ఈ పోటీలకు సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈయన జేఎన్టీయూ గురజాడ జట్టు తరుపున జనవరి 3 నుండి 6వ తేదీలలో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విజయవాడ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో జరగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా కళాశాల సంచాలకులు ఎం శశిభూషణరావు మాట్లాడుతూ తాము ఎంచుకున్న రంగంలో మిక్కిలి నైపుణ్యాన్ని ప్రదర్శించి కళాశాలకు తమ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ప్రత్యేకమైన బహుమతితో సత్కరించారు. ఈ క్రీడా అభినందన సభలో హెచ్ అండ్ బి ఎస్ విభాగ అధిపతి డాక్టర్ కే శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్లు జె మహేశ్వరరావు టి శ్రీదేవి, సిఎస్ఓ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థి మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# సాంస్కృతిక వారసత్వానికి రక్షణ

**- గురజాడ గృహ పునరుద్ధరణకు రూ.12.05 లక్షలు మంజూరు**

**- ఎం.ఎస్.ఎం.ఈ, ఎన్.ఆర్.ఐ సాధికారత శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** తెలుగు జాతికి గర్వకారణ మైన ప్రముఖ సంఘసంస్కర్త, సాహిత్య యుగపురుషుడు గురజాడ అప్పారావు గారి చారిత్రక గృహాన్ని సాంస్కృతిక వారసత్వ సంపదగా భావించి దాని పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురజాడ గారి చారిత్రక గృహానికి తగిన రక్షణ లేక ఆకతాయిలు లోపలికి ప్రవేశిస్తున్నారనే విషయాన్ని గురజాడ గారి వారసులు వెంకట ప్రసాద్, ఇందిరా దంపతులు ఈ నెల 25న తన దృష్టికి తీసుకు వచ్చారని మంత్రి తెలిపారు. దీనిపై తాను వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యతో చర్చించామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజనీర్ గురజాడ గృహాన్ని పరిశీలించి అంచనాలు రూపొందించగా, వాటిని పరిశీలించిన అనంతరం గృహ పునరుద్ధరణ, భద్రత చర్యల కోసం మొత్తం రూ.12.05 లక్షలు మంజూరు చేయడం జరిగిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయ్యిందని మంత్రి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురజాడ గృహం కేవలం ఒక నివాసం మాత్రమే కాకుండా తెలుగు సాహిత్య, సామాజిక చైతన్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ నిధులతో టాయిలెట్ నిర్మాణం, పైకప్పు వాటర్‌ప్రూఫ్ మరమ్మత్తులు, అంతర్గత–బాహ్య రంగుల పనులు చేపడతామని చెప్పారు. తలుపులు, కిటికీల ఎనామెల్ పెయింటింగ్, ప్రహరీ గోడపై బార్బ్ వైర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని అన్నారు. పాత గోడ గడియారం మరమ్మత్తులు, ఓపెన్ ఏరియా అభివృద్ధి పనులు జరుగుతాయని, విద్యుత్ వ్యవస్థను సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్‌కు మార్చడం జరుగుతుందని వివరించారు. ఈ గృహం కలకాలం నిలిచి గురజాడ గారి ఆలోచనలు, ఆదర్శాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# మరిడమ్మ ఆలయంలో చండీహోమం, విశేష పూజలు





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రీ మరిడమ్మ అమ్మవారికి, పౌర్ణమి సందర్భముగా చండీ హోమం, శుక్రవారం సందర్భంగా అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఉదయం 5 గంటల నుంచి తొలుత మరిడమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి బంగారు, వెండి పుష్పములతో ఆసాదులు, వేదపారాయణ దారులు పూజ, అర్చన కార్యక్రమములు జరిపించారు. అనంతరం పౌర్ణమి సందర్భంగా చండీ హోమం పూజాలను చేపట్టారు. ఈ కార్యక్ర మంలో భక్తులు, మహిళలు పాల్గొనగా వారికి ఆలయ అధికారులు పులిహోర ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజలను దేవాదాయ సహాయ కమీషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె విజయ లక్ష్మి పర్యవేక్షించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం : ఎమ్మెల్యే



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'ప్రజా దర్బార్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు ఎమ్మెల్యే స్వీకరించారు. వచ్చిన అన్ని దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిశీలించి తగిన పరిష్కారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే తనయులు నిమ్మ కాయల రంగనాగ్, తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీను బాబు, పట్టణ గౌరవాధ్యక్షులు అడబాల కుమారస్వామి, నాయకులు నూనె రామారావు, సామర్లకోట మండల అధ్యక్షుడు శ్రీరాములు, పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, తహసీల్దార్ కె చంద్రశేఖర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె హిమమహేశ్వరి, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 9లోగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ పూర్తి కావాలి : జిల్లా కలెక్టర్ - ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈ నెల 9వ తేదీలోగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ట్రాన్స్‌పోర్ట్, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి కృష్ణబాబు ఇతర ఉన్నతాధికారులు శుక్రవారం సాయంత్రం సచివాలయం నుంచి వీడియో కానారేన్స్ నిర్వహించారు. ప్రభుత్వ సేవలు– ప్రజాభిప్రాయం, రైల్వే మౌలిక సదుపాయాలు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి, జెసి సేధు మాధవన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ విసి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ నెల 9వ తేదీలోగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే నియోజకవర్గస్థాయిలో కార్యక్రమాలను ఏర్పాటు చేసి, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. అదేవిధంగా యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే వేగంగా నిర్వహించాలని, ఈ నెల 12వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో రైతుల సంతృప్త స్థాయి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, యూరియా కొరత రానివ్వకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

# పరిశ్రమలకు అనుమతుల్లో జాప్యం వద్దు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా, పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులను నిబంధనల మేరకు అత్యంత వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.
పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్న తర్వాత చట్టబద్ధమైన గడువు ముగిసే వరకు వేచి చూడకుండా, వెంటనే వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఏదైనా శాఖ వద్ద అనుమతులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తిస్తే, పరిశ్రమల శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆయా శాఖలతో సమన్వయం చేసుకొని సమస్యను పరిష్కరించాలని సూచించారు. జిల్లాకు వచ్చే పారిశ్రామికవేత్తలకు జిల్లా యంత్రాంగం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో కొత్తగా ఏర్పాటు కానున్న 8 ప్రధాన పరిశ్రమల పురోగతిపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్, స్టీల్ ఎక్స్చేంజ్ ఇండియా లిమిటెడ్, స్టీల్ ఎక్స్చేంజ్ ఎన్‌ఫ్రా లాజిస్టిక్స్ లిమిటెడ్, అన్సుమి స్పేస్ కార్పొరేషన్, జెఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రీస్ పార్క్ లిమిటెడ్, వైశాఖి గ్రోత్ కారిడార్, రుషిల్ డెకర్స్, ఎలైట్లాజిక్స్ ఎగ్జిమ్ ఏజెన్సీ ఇండియా లిమిటెడ్ వంటి కంపెనీలు జిల్లాలో తమ యూనిట్లను స్థాపించేందుకు ముందుకు వచ్చాయని, వీటి ద్వారా పెద్ద ఎత్తున స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. యువత కేవలం ఉద్యోగాల వేటలోనే ఉండకుండా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అధికారులందరూ కలిసికట్టుగా కృషి చేసి వారిలో చైతన్యం నింపాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ ఇన్‌ఛార్జి జిఎం ఎం.వి. కరుణాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం. మురళీమోహన్ మరియు పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫ్రెండ్స్ వాకర్స్ ప్రమాణ స్వీకార మహోత్సవం









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం కిలారి తిరుపతి నాయుడు కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ ప్రమాణ స్వీకారంలో ఇన్స్టిలేషన్ ఆఫీసర్గా 203 గవర్నర్ అయిన నలుబోలు బల రామయ్య నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షునిగా షేక్ నసీర్ అహ్మద్ కార్యదర్శిగా శానంపూడి సుబ్బరాయుడు కోశాధికారిగా సితారి రత్నయ్య గౌరవ అధ్యక్షులుగా బిరదవోలు రామ్మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. నూతన కార్యవర్గం సభ్యులందరూ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సభలో విశిష్ట అతిథిగా వాకర్ ఇంటర్నేషనల్ 2022 ప్రెసిడెంట్ అయినటు వంటి నేతాజీ ఎంవి సుబ్బారెడ్డి వారి సందేశం ఇస్తూ వాకర్సు సేవా దృక్పథంతో ఐకమత్యంగా పనిచేయాలని కోరారు. ఏవిపి2 ఏకొల్లు రాఘవ రెడ్డి 203 డిస్టిక్ గవర్నర్ 2020 ఎస్ రాఘవేంద్ర శెట్టి, 203 డిస్టిక్ గవర్నర్ 2023 ఎంవి వెంకటాద్రి రెడ్డి, పాల్గొనడం జరిగింది.
అసోసియేషన్ సభ్యులు స్టేడియంలోని ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొని కార్యక్రమమును జయ ప్రదం చేయడం జరిగినది తదనంతరము అల్పాహార విందు ఏర్పాటు చేయడమైనది.

# సీఎం చంద్రబాబు సుపరిపాలనతో ప్రజా సంక్షేమం

**- కోవూరు మండలంలో ఒకేరోజు 3 విపిఆర్ అమృతధార ప్లాంట్ల ప్రారంభం - ప్రజలకు సేవ చేయడమే మా రాజకీయం - విపిఆర్ ఫౌండేషన్ ఇలాగే పనిచేస్తుంది - తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణ గల పార్టీలో ఉన్నారు - అందరం కలిసి ముందుకు సాగుదాం - విద్యాదానం, జలదానం చేశారు.. ఇప్పుడు నేత్ర దానంతో మరో మెట్టు ఎక్కారు - అవసరాన్ని గుర్తించి పనిచేయడమే విపిఆర్ నైజం - కోవూరు పంచాయతీని మున్సిపాలిటీగా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం**










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుపరిపాలనతో ప్రజా సంక్షేమం అమలవుతోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కోవూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పడుగుపాడులో విపిఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన సందర్భంగా పాఠశాల విద్యార్థినుల సందడితో కోలాహలం నెలకొంది. ప్లాంట్ ప్రారంభం అనంతరం విద్యార్థినులతో ఎంపీ, ఎమ్మెల్యేలు సరదాగా ముచ్చటించారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విపిఆర్ వాటర్‌ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్రీజర్ అందించారు. అక్కడి నుంచి పడుగుపాడులో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనతో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి పాలిటిక్స్ అంటే పాషన్ అని, సమయం కూడా చూసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తుంటారన్నారు. సీఎం చంద్రబాబు మంచి పాలనలో ఉన్నామని, క్రమశిక్షణగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు దేశం పార్టీ కార్యకర్తల సొంతమని, కార్యకర్తే పార్టీకి బలమన్నారు. ఎవరూ చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించొద్దని చెప్పారు. సేవ కోసమే తాము రాజకీయాల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల్లో అభివృద్ధికి గవర్నమెంట్ ఫండ్స్ తెచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటూరులో చేనేత మినీ క్లస్టర్ కు 76 లక్షలు నిధులు సాధించామన్నారు. ఈ రోజు 5 ప్లాంట్లు ఏర్పాటు చేశామని అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. ఒకే రోజు అయిదు వాటర్ ప్లాంట్‌లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మానవసేవే మాధవ సేవ అని నమ్మిన విపిఆర్ అదే లక్ష్యంతో పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. విపిఆర్ వికాస్, విపిఆర్ విద్య, ట్రై సైకిల్స్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. విపిఆర్ నేత్ర అనే మానస పుత్రిక ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కంటిచూపు మెరుగుపరుస్తున్నారని కొనియాడారు. కోవూరు నియోజకవర్గంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు పది వేల మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని, ఒక పడుగుపాడులోనే 4 నుంచి 5 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పీటర్ కెనాన్‌ను ప్రారంభించామని, బాపన కాలువను కూడా చేస్తున్నామన్నారు. కోవూరు పంచాయతీని మున్సిపాలిటీగా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర మాట్లాడుతూ.. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు జరిగిన కార్యక్రమాలు ఒక ఊరేగింపుగా జరిగాయని అన్నారు. మరో వారం రోజుల్లో మరో 15 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయని, ప్రజా అవసరాలు గుర్తించి పని చేయడంలో వేమిరెడ్డి దంపతులను మించిన వారు లేరన్నారు. ప్లాంట్లు ఏర్పాటు చేయడమే కాకుండా మెయింటెనెన్స్ కూడా నిర్వహించడం వారికే చెల్లిందన్నారు. విపిఆర్ నేత్ర సాధారణ కార్యక్రమం కాదని, రెండు మండలాలకే రెండు నెలలు పట్టిందంటే ఎంత సమర్థవంతంగా పని జరుగుతుందో అర్థమవుతుందన్నారు. విద్యా దానం, జలదానం చేసిన విపిఆర్ దంపతులు ఇప్పుడు నేత్రదానం కూడా చేస్తున్నారని కొనియాడారు. నిలబడలేని, కాళ్ళులేని ఎంతోమంది దివ్యాంగులను గుర్తించి ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందించారని చెప్పారు. విపిఆర్ నేత్రాలకు సంబంధించి మరో బస్సును కోవూరు, విడవలూరు మండలం నుంచి ప్రారంభిస్తామని వెల్లడించడం గొప్ప విషయమని బీద రవిచంద్ర అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, వంశీరెడ్డి, కమలాకర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, ఎంపీపీ తుమ్మల పార్వతి, సర్పంచి యాకసిరి విజయమ్మ, వెంకటరమణమ్మ, పార్టీ మాజీ మండలాధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, మదన్ రెడ్డి, రాఖీ, పిచ్చుక మధుసూధన్, రాజు అశోక్, తవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చిత్తూరు జిల్లా పుంగనూరులో మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మర్యాదగా పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామచంద్రా రెడ్డితో చంద్రశేఖర్ రెడ్డి పలు అంశాల గురించి చర్చించారు. అనంతరం ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని చంద్రశేఖర్ రెడ్డి కలిశారు.



## జిల్లా కలెక్టర్‌తో భేటీ అయిన ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన ఇంచార్జ్ మేయర్ పి.రూప్ కుమార్ యాదవ్.

# వ్యవసాయ యాంత్రీకరణకు విరివిగా రుణాలు మంజూరు చేయాలి

**- వ్యవసాయ అనుబంధ రంగాలను బ్యాంకర్లు ప్రోత్సహించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన కార్యాచరణ వివరాలను లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని, ఖర్చులు తగ్గి వ్యవసాయం మరింత సులభతరం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, డ్రోన్‌లు వంటి పరికరాల కొనుగోలుకు అన్ని బ్యాంకులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, గ్రూపుల వారీగా అలాగే వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాల కొనుగోలుకు రుణాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రుణాలు అవసరమైన రైతులను గుర్తించి సంబంధిత బ్యాంకులతో సమన్వయం చేయాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, కోళ్ల పరిశ్రమలను ప్రోత్సహించేలా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉన్న రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దరఖాస్తులను తిరస్కరించకుండా ఎక్కువ మందికి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ఈనెల 28వ తేదీన వ్యవసాయ యాంత్రీకరణతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు మంజూరు చేస్తున్న రుణాలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఖచ్చితమైన డేటాతో సంబంధిత బ్యాంకర్లు సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్, నాబార్డ్ డిడిఎం బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవేణి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ అధికారులు రమేష్‌నాయక్, శాంతి తదితర శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తిరుమల తిరుపతి దేవస్థానంలో విఐపి బ్రేక్ దర్శన సమయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు చంద్రశేఖర్ రెడ్డికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు.



## సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని గాజు గ్లాసు, గవ్వపై అద్భుతంగా సావిత్రిబాయి పూలే చిత్రం సోమా పద్మా రత్నం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం ప్రముఖ చిత్రకారుడు తెలుగు పండిట్ సోమా పద్మా రత్నం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని గాజు గ్లాస్ మరియు గవ్వపై సావిత్రిబాయి పూలే చిత్రం అద్భుతంగా వేశారు ఈ సందర్భంగా సోమా మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతి ప్రతి సంవత్సరం 1831 జనవరి 3న మహారాష్ట్రలోని నైగావ్ గ్రామంలో జన్మించారు.

ఆమె భారత దేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సంఘ సంస్కర్త కవయిత్రిగా మహిళా విద్యకు అంటరానితనం నిర్మూలనకు విశేష కృషి చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం కూడా ప్రకటించింది అని కొనియాడారు...సోమా పద్మా రత్నం

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పాట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# హజ్రత్ అలీ (రజిఅన్) జయంతి సందర్భంగా కవి కరీముల్లా సామాజిక వ్యాసం

## - ధీరత్వ ప్రతిరూపం హజ్రత్ అలీ (రజిఅన్)

హజ్రత్ అలీ రజిఅన్ క్రీ.శ.600 సం.లో రజబ్ నెల పదమూడవ తేదీన అబూతాలిబ్, ఫాతిమా బిన్తె అసద్ దంపతులకు మక్కాలో జన్మించారు. అప్పట్లో మక్కాలో దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు అలజడి రేపాయి.అందరి దేవుడు ఒక్కడే, మానవులంతా పుట్టుకరీత్యా అందరూ సమానులే అనే ఆయన మాట మక్కా సర్దార్లకు రుచించలేదు. ఏమిటీ! అందరి దేవుడు ఒక్కడా, నీగ్రో బానిసలు కూడా మాకు సమానమా! అంటూ హూంకరిస్తూ ప్రవక్తపై కత్తి కట్టారు. ఆయనపై భౌతిక దాడులు మొదలయ్యాయి.సందేశ ప్రచారం క్లిష్టంగా మారింది.. ప్రవక్తను అనుసరించడమంటే కోరి కోరి కష్టాలను కొని తెచ్చుకోవడమే. ఇలాంటి సందర్భంలో ప్రవక్త ఓ సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని బాధలను అధిగమించి నాతో నడిచేందుకు మీలో ఎవరైనా సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నించారు.. నిశ్శబ్దం తాండవించింది. ఇంతలో ఓ గొంతు నేను మీతో నడుస్తాను ప్రవక్త అని లేచి నిలబడింది.. అంతటా ఆశ్చర్యం. అది ఓ బాలుని గొంతు..ఆ బాలుని తర్వాతి కాలంలో అసమాన ధీరునిగా, దైవ ప్రవక్త అల్లుడిగా, ఇస్లామియా రాజ్యానికి నాలుగో ఖలీఫాగా చరిత్ర లిఖించింది..ఆ బాలుని పేరే హజ్రత్ అలీ (రజిఅన్). ఓసారి అలీ రజిఅన్ వడ్రంగి పని చేసుకుంటూ పనిలో నిమగ్నమై ఉన్నారు. ఓ యూదు వహిల్వాన్ రంకెలు వేసుకుంటూ నన్ను ఎదుర్కొనే శూరుడు మీలో ఎవరైనా ఉన్నారా అంటూ అలీ వద్దకు వచ్చి రెచ్చగొట్టసాగాడు. ఇతరుల్ని చిత్తు చేసేవాడు శూరుడు కాడు. ఆగ్రహంలో నిగ్రహం చూపేవాడే మీలో నిజమైన శూరుడు అని బోధించిన ప్రవక్త వాక్కును అనుసరించి సహనం వహించి అలీ తన పని తను చేసుకుంటున్నారు. నానావిధాలుగా దూషించడం మొదలుపెట్టాడు.. అలీ కనీసం కన్నెత్తి చూడటం లేదు.ఇక లాభం లేదనుకుని ముహమ్మద్ (స)దైవ ప్రవక్త అనే విశ్వాసమే నీకుంటే నాతో తలపడు అంటూ అరవసాగాడు. అప్పుడిక అలీ పోరాటానికి సిద్ధమన్నారు.ఇద్దరి మధ్య కరవాల యుద్ధం మొదలైంది. ఒక్క ఉదుటున ఆ వహిల్వాన్ని మట్టికరిపించి అతని గుండెలపై కూర్చున్నారు అలీ. ఉక్రోషం పట్టలేక తుపుక్కున అలీ ముఖంపై ఉమ్మేశాడు ఆ యూదు వహిల్వాన్. ఆ వెంటనే చేతిలోని కరవాలం పారేసి మౌనంగా వెళ్లసాగారు అలీ..ఆ వహిల్వాన్‌కు ఏమీ అర్థం కాలేదు. తనను చంపే అవకాశం ఉన్నప్పటికీ అలా కత్తి పడేయటం అతన్ని ఆశ్చర్యపర్చింది. వీరుడా ! అలీ నన్నింతవరకూ మట్టికరిపించిన వారే లేరు. ఉమ్మి వేసిన వెంటనే మీ కత్తి నా గుండెల్లో దిగుతుందేమో అనుకున్నాను. మీరెందుకు నన్ను వదిలేశారో చెప్పగలరా? అంటూ అడిగాడు. అప్పుడు అలీ ఓయీ! నీవు నాపై ఉమ్మేయగానే నావంటి వీరునిపై ఉమ్మేస్తాడా ఇతను అనే అహంకారం నాలో ప్రవేశించింది. అహంకారాన్ని ఇస్లాం అంగీకరించదు. శూరత్వాన్ని నిరూపించుకోవటం కోసం ఇతరుల్ని చంపటం ఆమోదం కాదు. ఇంతవరకూ నీతో పోరాడింది ప్రవక్త ముహమ్మద్ దైవ ప్రవక్త అని సాక్ష్యమిచ్చేందుకే తప్ప నాకు నీపై ఎలాంటి ద్వేషం లేదు అని పలికారు అలీ. ఈ సమాధానం ఆ యూదు వహిల్వాన్ని నిరొంతపర్చింది.. ప్రవక్త బోధపై విశ్వాసంతో సహనం వహించిన అలీ రజిఅన్ పట్ల అతనిలో గౌరవం పెరిగింది.. ఇంతగా సహనాన్ని ప్రబోధించి తన సహచరులచే ఆచరింపజేస్తున్న ముహమ్మద్ ప్రవక్త ఖచ్చితంగా దైవ ప్రవక్తే అని చెప్తూ అచేతనంగా అతని నోటి నుండి లాయిలాహ యిల్లల్లాహ్ ముహమ్మదురసూలుల్లాహ్ (దేవుడు ఒక్కడే. ఆయన తప్ప మరే ఆరాధ్యుడు లేడు. ముహమ్మద్ దైవ ప్రవక్త అని సాక్ష్యం ఇస్తున్నాను) అంటూ పలవరించసాగాడు ఆ వహిల్వాన్. హజ్రత్ అలీ రజిఅన్ అతన్ని తన గుండెలకు హత్తుకున్నారు.. అలీ చూపిన సహనం అతనిలో పరివర్తన తెచ్చింది. అత్యంత క్లిష్టమైన సమయాలలో ప్రవక్తకు తోడుగా నిలబడ్డారు అలీ. కీలకమైన బదర్ యుద్ధంలోనూ అనేక యుద్ధాల్లో చూపిన తన శౌర్య ప్రతాపాలతో దేవుని బెబ్బులి అని ఖ్యాతి గాంచారు. ఇస్లామియా చరిత్రలో నాలుగో ఖలీఫాగా గణుతికెక్కిన అలీ ఇస్లాం ప్రబోధించిన సమన్యాయం, సామాజిక సంక్షేమం ప్రాతిపదికన పరిపాలించారు. ముఖ్యంగా అలీ శ్రమ దోపిడిని వ్యతిరేకించారు. పని గంటలు లేని ఆ కాలంలో పనిగంటల్ని నిర్దేశించారు. కనుకే ప్రవక్త ముహమ్మద్ (స)నేను జ్ఞాన పట్టణమైతే అలీ దానికి ద్వారం వంటి వాడు. అలీని ప్రేమిస్తే నన్ను ప్రేమించినట్టే అన్నారు. అలీ క్రీ.శ. 661లో పరమపదించారు.

**- కవి కలీముల్లా,** వినుకొండ

# జీవీఎంసీ స్థాయి సంఘంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయి సంఘం సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని నగర మేయర్, స్థాయి సంఘం చైర్ పర్సన్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మంది రంలో స్థాయి సంఘం సభ్యులు సేనాపతి వసంత, మొల్లి హేమ లత, మొల్లి ముత్యాలు, గంకల కవిత, రాపర్తి త్రివేణి వరప్రసా దరావు, దాడి వెంకటేశ్వరరావు, గేదెల లావణ్య, మాదంశెట్టి చిన్న తల్లి, కొణతాల నీలిమ, సాడి పద్మా రెడ్డిలతో కలసి స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయి సంఘం చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం సమావేశంలో ప్రధాన అజెండాలో 87 అంశాలు, 52 టేబుల్ అజెండా అంశాలతో పాటు మొత్తం 139 అంశాలు పొందుపరచగా, వాటిని స్థాయి సంఘం సభ్యులు క్షుణ్ణంగా చర్చించి వివిధ కారణాలు వలన 30 అంశాలు వాయిదా వేశారని, మిగిలిన మొత్తం 109 అంశాలకు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్



విభాగానికి సంబంధించి సుమారు 26.46 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి వాసుదేవ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్ శ్రీనివాసరావు, కార్యదర్శి బివి రమణ, పిడి-యుసిడి సరోజిని, జోనర్ కమిషనర్లు ఎం.మల్లయ్య నాయుడు, కే.శివప్రసాద్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఎ.ఎమ్.ఒ.హెచ్‌లు, యు సి డి డిపిఓ, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కప్పేసిన మంచు దుప్పటి





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని అనేక ప్రాంతాలలో తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగ మంచు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఉదయం 7 గంటల వరకు పొగ మంచు దట్టంగా ఉండడంతో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. వాహనదారులు పట్టపగలే లైట్లు వేసుకుని వాహనాలు నడపవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ పొగమంచు కారణంగా మామిడి రైతులకు నష్టం వాటిని పంట చీడపీడల బారిన పడే ప్రమాదం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan